క్లుప్తంగా

నేటి ఉపాధి పనుల తనిఖీ

శావల్యాపురం: మండలంలోని అన్నీ గ్రామాల్లో జాతీయ ఉపాధి పథకం 15 విడత సామాజిక తనిఖీలు ఆదివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.సీతారామయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక టీమ్ సభ్యులతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 1ఏప్రిల్, 2021 నుంచి మార్చి 30, 2022 ఆర్థిక సంవత్సరంలో చేసిన అన్నీ శాఖల పనులకు సంబంధించి సామాజిక బృందం ఆడిట్ చేస్తారన్నారు. సమావేశంలో ఏపీఎం రాజు, ఎస్ఆర్పీ పున్నపనాయుడు, డీఆర్పీ రవికుమార్ పాల్గొన్నారు.

ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తులు

వినుకొండ టౌన్: ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత- 2023 అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుద్ధ్య ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన పారిశుద్ధ్య మహిళా కార్మికుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడిచెత్త వినియోగం వంటి విభాగాలలో కృషి చేస్తున్న మహిళలు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులను ఈ నెల 22లోగా అందజేయాలని కోరారు. ఎంపికైన వారికి 5 జూన్ 2023న నిర్వహించనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో అవార్డులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

చిలకలూరిపేట టౌన్: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని గుండయ్యతోటకు చెందిన అన్నలదాసు సుబ్బారావు(37) ఈ నెల 10వ తేదీ ఆర్థిక ఇబ్బందులతో వంటిపై కిరోసిన్ పోసుకొని ఇంటి బయట నిప్పంటించుకున్నాడు. గమనించిన భార్య స్థానికులు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్బారావు శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంతో పోషకాలు



మాట్లాడుతున్న రాష్ట్ర కమిషనర్, బాలల హక్కుల అధికారి బత్తుల పద్మావతి

చిలకలూరిపేట టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంతో పోషక విలువలు పుష్కలంగా లభిస్తాయని రాష్ట్ర కమిషనర్, బాలల హక్కుల అధికారి బత్తుల పద్మావతి చెప్పారు. శనివారం పట్టణంలోని శ్రీశారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో అందజేస్తున్న రాగి జావ, కోడిగుడ్లు, చిక్కీల వలన రక్తహీనత లేకుండా ఉంటారని తెలిపారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనం చేశారు. కార్యక్రమంలో నాదెండ్ల సీడీపీఓ శాంతకుమారి, మండల విద్యాశాఖాధికారి లక్ష్మి, అర్బన్ ఎస్ఐ మోహన్, పాఠశాల హెచ్ఎం అరుణ కుమారి పాల్గొన్నారు.

నేతి వెంకన్న దర్శనం.. పూర్వజన్మ సుకృతం



పూజా కార్యక్రమాల్లో మంత్రులు ఆర్కే రోజా, అంబటి రాంబాబు

రాజుపాలెం: దశావతారాల్లో మొదటి అవతారమైన మత్స్యావతారంలో స్వయంభూగా వెలసిన నేతివెంకన్న స్వామిని దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. మండలంలోని దేవరంపాడు కొండపై నేతి వెంకన్న స్వామి 4వ శనివారం తిరుణాళ్ల అత్యంత వైభవంగా జరిగింది. తిరునాళ్లకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుతో కలసి మంత్రి రోజా విచ్చేశారు. మంత్రులను వేద పండితులు, దేవాలయ కమిటీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. మంత్రి రోజా విలేకర్లతో మాట్లాడుతూ.. మంత్రి అంబటి రాంబాబు ఆహ్వానం మేరకు స్వామివారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. ఆలయ అభివృద్ధికి అంబటి రాంబాబు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. తమ అదృష్టం మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దొరకడమన్నారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రతి రోజూ స్వామివారిని భక్తులు దర్శించుకునేలా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు.

ఆటోనగర్ నిర్మాణానికి స్థల పరిశీలన



ఆటోనగర్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణంలోని మార్కాపురం రోడ్డు పసుపులేరు వంతెన వద్ద ఆటోనగర్‌కు కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు శనివారం పరిశీలించారు. పసుపులేరు వంతెన పక్క గుంటూరు- కర్నూలు జాతీయ రహదారిని ఆనుకొని పది ఎకరాల స్థలాన్ని ఆటోనగర్‌కు కేటాయించారు. భూముల పరిశీలన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి సొంత షాపులు లేక రోడ్ల పక్కన మోటారు వర్కర్లు పనిచేస్తున్నారని, వారి సమస్యలను గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయసహకారాలతో 300 మందికి ప్రయోజనం చేకూరేలా వారికి పూర్తి హక్కులు కల్పిస్తామని అన్నారు. అందులోనే మరో నాలుగు ఎకరాలు లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గంటా సుభాని, ముస్లిం మైనార్టీ నాయకులు పీఎస్ ఖాన్, మండల కన్వీనర్ దండు చెన్నయ్య, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, ఉడ్బ్ కోఆప్షన్ సభ్యులు గుండాల స్వెనోమ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా గీతాంజలి పాఠశాల ఫేర్‌వెల్ డే

వినుకొండ(నూజెండ్ల): స్థానిక గీతాంజలి స్కూల్ పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలు పట్టణంలోని గంగినేని కల్యాణ మండపంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి చక్కగా చదువుకొని మంచి అవకాశాలు అందిపుచ్చుకొని భావిభారత పౌరులుగా మంచి పదవులు అధిరోహించాలని కోరారు. రాబోయే 10వ తరగతి పరీక్షలు చక్కగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. చిలుమూరు శ్రీరామ రూరల్ విద్యా సంస్థల చైర్మన్ కొలసాని తులసీ విష్ణుప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులను, గురువులను ఎట్టి కష్టాలు ఎదురైనా మర్చిపోకుండా వారిని ఎల్లవేళలా గౌరవించాలన్నారు. 593 మార్కులు సాధించిన లిఖిత తల్లిదండ్రులకు రూ.5వేలు, 580కి పైగా సాధించిన ఆరుగురు విద్యార్థులకు రూ.2వేలు చొప్పున అందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ గుండాల స్వెనోమ్, కౌన్సిలర్లు షేక్ షకీలా, ఎంఎస్‌కే బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు దండు చెన్నయ్య, ములకా రామతులసి రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్‌కనెక్షన్ పనులతో తాగునీటి సమస్యకు పరిష్కారం

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, అధికారులు

చిలకలూరిపేట: పైపులైన్ల ఇంటర్ కనెక్షన్ పనుల ద్వారా పట్టణ పరిధిలో తాగునీటి సరఫరాకు సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలో పైపులైన్ ఇంటర్ కనెక్షన్ల పనులకు తొమ్మిదో వార్డులో శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో పాత పైపులైన్లు, అమృత్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన కొత్త పైపులైన్లు అనుసంధాన ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని పండరీపురంలోని రెండు ట్యాంకులు, గాంధీ పార్కు, వాసవీనగర్, శ్రీనివాసనగర్, తూర్పుమాలపల్లె, టిడ్కో గృహ సముదాయంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులకు సంబంధించి నీటి సరఫరాను ఏడు జోన్లుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటికే ఫేజ్ -1 కింద ఐదు జోన్ల పరిధిలో పనులు నిర్వహించగా, ఫేజ్-2 కింద మరో రెండు జోన్లలో పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడు జోన్ల పరిధిలో ఇంటర్‌కనెక్షన్ల ప్రక్రియకు అవసరమైన నిధులు వెచ్చించి పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ పనులు పూర్తి అయితే ఆయా ప్రాంతాలలో సంబంధిత ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా జరిగి మంచినీటి సమస్యలు పూర్తిగా తొలిగిపోతాయని వెల్లడించారు. ఇంటర్‌కనెక్షన్ల ప్రక్రియకు ఏఎంజీ స్వచ్ఛంద సంస్థ సహకారం తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని పదో వార్డులో రూ.12.5 లక్షలతో చేపట్టనున్న మూడు గ్రావెల్‌రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో విడదల గోపీనాథ్, వైస్ చైర్మన్లు వలేటి వెంకటేశ్వరరావు, కొలిశెట్టి శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, సొసైటీ చైర్మన్ తోట బ్రహ్మస్వాములు, 9,10 వార్డు కౌన్సిలర్లు చింతపల్లి విల్సన్, బేరింగ్ మౌలాలి, మాజీ కౌన్సిలర్ సయ్యద్ బషీర్ మేస్త్రి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ పాల్గొన్నారు.

పనులను నాణ్యతతో పూర్తి చేయండి

నరసరావుపేట: పురపాలక సంఘం పరిధిలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సూచన మేరకు గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో వినతులపై ఆయా వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు, మున్సిపల్ డీఈ ఓ.శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఒకటో వార్డు చంద్రబాబునాయుడు కాలనీలో నిర్మిస్తున్న కల్వర్టులు, అదేవిధంగా ప్రకాష్‌నగర్ పదోవార్డులో నిర్మిస్తున్న సైడ్ కాలువల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. నిర్మాణాలను నాణ్యతతో త్వరితంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు తగిన సూచనలు ఇచ్చారు. వార్డు ఎమినిటీ సెక్రటరీతో మాట్లాడుతూ దగ్గరుండి ఈ నిర్మాణ పనులను ప్రతిరోజు పర్యవేక్షణ చేసి పనులు ఎంతవరకు పూర్తయ్యాయో ప్రతిరోజు నివేదికను అసిస్టెంట్ ఇంజినీర్లకి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. వీరి వెంట మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ రాములు నాయక్ ఉన్నారు.

టీవీఎస్ ఐ క్యూబ్ ఎలక్ట్రిక్ స్కూటర్ ప్రారంభం



నరసరావుపేట రూరల్: ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగించాల్సిన అవసరం ఉందని జిల్లా రవాణా శాఖ అధికారి టీకే పరందామరెడ్డి తెలిపారు. పల్నాడు రోడ్డులోని యూనిటీ టీవీఎస్ షోరూమ్‌లో ఐ క్యూబ్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా రవాణా శాఖ అధికారి పరందామరెడ్డి హాజరై స్కూటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. టీవీఎస్ కంపెనీ మేనేజర్ జె.విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ గ్రీన్ టూ వీలర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు పొందిన టీవీఎస్ ఐక్యూబ్ ఎలక్ట్రిక్ స్కూటర్‌కు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని తెలిపారు. టీవీఎస్ సీఈఓ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ షోరూమ్‌లో ఎలక్ట్రిక్ స్కూటర్ టెస్ట్ డ్రైవ్, బుకింగ్స్‌కు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు.

అందుబాటులోకి ముస్లింల ఆరామక్షేత్రం



ఆరామక్షేత్రంలో మృతదేహంతో ఖబరస్థాన్ కమిటీ అధ్యక్షులు, మృతుని బంధువులు

నరసరావుపేట: స్థానిక బాబాపేటలోని ముస్లింల శ్మశానవాటికలో ఏర్పాటుచేసిన ముస్లిం ఆరామక్షేత్ర సేవలు అందుబాటులోకి వచ్చాయి. పట్టణంలోని బరంపేట మిట్టబజార్‌కు చెందిన షేక్ మస్తాన్‌వలి అనారోగ్యంతో మృతి చెందాడు. సొంత ఇల్లులేని కారణంగా ముస్లిం ఆరామ క్షేత్ర సహాయంతో బంధువులు శనివారం అంత్యక్రియలు నిర్వహించుకున్నారు. వారి మట్టి ఖర్చుల నిమిత్తం ముస్లిం ఖబరస్థాన్ అభివృద్ధి కమిటీ రూ.10వేలు ఆర్థిక సహాయం చేసింది. ఎవరైనా పేదలు ఉంటే ఆరామక్షేత్రం ఉపయోగించుకోవాలని ఖబరస్తాన్ అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ షేక్ ఖాదర్‌బాషా, సెక్రటరీ సయ్యద్ జాఫర్ తెలిపారు. ముస్లింలకోసం ఆరామక్షేత్రం నిర్మించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి ఖబరస్తాన్ కమిటీ ప్రతినిధులు, మృతిచెందిన మస్తాన్‌వలి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన



కల్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, దాతలు

నాదెండ్ల: గణపవరం- కావూరు డొంక రోడ్డులోని వీరాంజనేయస్వామి దేవస్థానం ఆవరణలో శనివారం కల్యాణ మండప నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కాట్రు శ్రీనివాసరావు, ఆదిపూడి మల్లికార్జునరావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం 10.18 గంటలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. బోయపాలేనికి చెందిన అర్చకులు కొండమోది అవినాష్, వీరేంద్ర బృందం ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, దిక్పాలకుల పూజ నిర్వహించారు. ప్రధాన దాత అనిశెట్టి సుబ్బారావు, జ్యోతి దంపతులు పీటలపై కూర్చొని పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు నవ ధాన్యాలు వేసి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. గతేడాది ఫిబ్రవరిలో రూ.50 లక్షలతో ఆలయ జీర్ణోద్ధరణ చేపట్టి రాతి చెక్కడాలతో విగ్రహ, ధ్వజస్తంభ, శిఖర, కలశ ప్రతిష్ఠ నిర్వహించారు. ప్రస్తుతం రూ.50 లక్షలతో కల్యాణ మండప నిర్మాణ పనులు చేపట్టారు. మరో ఆరు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాట్రు శ్రీపతి, మున్నంగి శేషయ్య, కాట్రు శివరామకృష్ణ, కృష్ణారావు, ప్రకాశరావు, అర్వపల్లి సత్యనారాయణగుప్త, అనిశెట్టి మస్తాన్‌బాబు, నన్నపనేని శ్రీనివాసరావు, కాట్రు శ్రీనివాసరావు, మేదూరి మధు పాల్గొన్నారు.

దళితుల సాగు భూములకు పట్టాలివ్వాలి



గొరిజవోలులో సముద్రయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు మధు

నాదెండ్ల: పేద, దళిత రైతులు సాగు చేసుకుంటున్న భూములను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఆయా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలని సీపీఎం సీనియర్ నాయకుడు పి.మధు కోరారు. మండలంలోని గొరిజవోలు గ్రామాన్ని శనివారం సందర్శించారు. ఇటీవల మృతి చెందిన సీపీఎం నాయకులు దావల సముద్రయ్య చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, సముద్రయ్య మూడు దశాబ్దాల క్రితం గ్రామంలో దళితులు సాగు చేసుకునే భూములను పెత్తందారులు కాజేసే యత్నాన్ని అడ్డుకున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నీరు-చెట్టు పేరుతో పేదలు సాగు చేసుకునే భూముల్లో మట్టి తవ్వకాలు చేశారని మండిపడ్డారు. నాడు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అడ్డుకోవటంతో అప్పట్లో మట్టితవ్వకాలు నిలిచిపోయాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవిష్యత్తులో భూములు సాగు చేసుకుంటున్న పేద దళిత రైతులకు అన్యాయం జరగకుండా వారి పేరిట రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. గొర్రెపాటి ప్రకాశం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దావల సముద్రయ్య జ్ఞాపకార్థం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీపీఎం జెండాను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మీశ్వర రెడ్డి, అధ్యక్షులు కారసాల రోశయ్య, చిలకలూరిపేట సీఐటీయూ మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పదో తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేస్తున్న సీఐ అచ్చయ్య

యడ్లపాడు: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి విజయం సాధించాలని చిలకలూరిపేట రూరల్ సీఐ వై.అచ్చయ్య చెప్పారు. మండల కేంద్రమైన యడ్లపాడులోని నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం పదో తరగతి చదివే 75 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. జాలాది గ్రామానికి చెందిన నాయకులు రావిపాటి చైతన్య సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో పాల్గొని సీఐ మాట్లాడుతూ ఒత్తిడి లేని ప్రశాంత వాతావరణంలో చదువుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. పరీక్ష కాలంలో సెల్‌ఫోన్లు, టీవీలను వీడాలన్నారు. కార్యక్రమంలో నాదెండ్ల ఎస్ఐ భాస్కర్, వంకాయలపాటి సాయి, మోహన్‌సాయి, హర్షాని, సాయి అఖిల్, స్కూల్ ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆశ వర్కర్ మృతి



నరసరావుపేట రూరల్: మండలంలోని ఉప్పలపాడు గ్రామం వద్ద గుంటూరు- కర్నూలు రహదారిపై శనివారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ ఆశ వర్కర్ మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. రూరల్ ఎస్ఐ బాలనాగిరెడ్డి తెలిపిన వివరాలు.. ఏల్చూరు గ్రామంలో ఆశ వర్కర్లుగా పనిచేస్తున్న గుంటూరు లక్ష్మి, ప్రత్తిపాటి శాంతి స్కూటీపై నరసరావుపేట ఏరియా వైద్యశాలకు వచ్చి గర్భిణులకు కావాల్సిన మందులు తీసుకొని తిరిగి గ్రామానికి వెళుతుండగా వినుకొండ వైపు నుంచి నరసరావుపేటకు వస్తున్న ఆటో వీరు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో లక్ష్మి మృతిచెందగా శాంతికి గాయపడింది. మృతురాలి భర్త జగన్‌మోహనరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురిపై దాడి కేసు నమోదు

యడ్లపాడు: బోయపాలెం గ్రామానికి చెందిన ఎం.రవీంద్ర నాయక్‌పై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని బ్రిక్ కంపెనీ యజమాని వి.శ్రీనుబాబు, కంపెనీలో గుమస్తా అయిన ఎం.రవీంద్రనాయక్‌ను ఇటీవల రూ.83,500 డబ్బులు వసూలుకు పంపించారు. అక్కడ నగదు వసూలు చేసి, వాటితో కనిపించకపోవడంతో నిర్వాహకులు, పోలీసులకు మౌఖికంగా తెలియజేసి వెతుకులాట ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి బోయపాలెంలో ఉన్నట్లు గుర్తించి నగదు ఇవ్వాలంటూ నిలదీశారు. సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అతడిపై శ్రీనుబాబుతో మరో ఇద్దరు దాడి చేశారు. పోలీసులకు అప్పగించారు. గాయాలైన రవీంద్రను చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక వైద్యసేవలు అందించి మెరుగైన చికిత్సకు గుంటూరు సమగ్ర ఆసుపత్రికి తరలించారు. బాధితుడి నుంచి ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ పైడి రాంబాబు ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాద బాధితులకు సత్వర న్యాయం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న అదనపు జిల్లా న్యాయమూర్తి నాగేశ్వరరావు

నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం అందేలా సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జారీ చేసిందని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఓ వెంకట నాగేశ్వరరావు శనివారం తెలిపారు. మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మోటర్ వెహికిల్ చట్ట సవరణలను, నూతన మార్గదర్శకాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ అధ్యక్షుడు కాకుమాను బాలహనుమంతారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రత్యేక లోక్‌అదాలత్‌లో..

మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక లోక్‌అదాలత్‌లో 10 కేసులు పరిష్కారం అయినట్లు 13వ జిల్లా అదనపు న్యాయమూర్తి ఓ వెంకట నాగేశ్వరరావు తెలిపారు.

వాటర్ గ్రిడ్‌తో తీరనున్న నీటి సమస్య



రేమిడిచర్ల గ్రామంలో ఓహెచ్‌బీఆర్ కోసం స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

బొల్లాపల్లి: వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని ప్రతి గ్రామానికి తాగునీటి సరఫరా ఉంటుందని గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈఈ కె.ఎస్.హెచ్.హెచ్.కుమార్‌రాజు చెప్పారు. మండలంలోని రేమిడిచర్లలో ఓవర్ హెడ్ బ్యాలెన్స్‌డ్ రిజర్వాయర్ (ఓహెచ్‌బీఆర్) నిర్మాణానికి స్థల పరిశీలన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ నాగార్జున సాగర్ నుంచి కృష్ణానది నీటిని మాచర్ల, కారెంపూడి మీదుగా నియోజకవర్గంలోని ప్రతి మండలానికి తరలించి మంచినీటి కొరత లేకుండా చేయడమే లక్ష్యంగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు వ్యయం రూ.1200 కోట్లు అని చెప్పారు. ప్రతి మండలంలో సర్వే జరుగుతుందని, సర్వే అనంతరం రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ద్వారా పనులు చేపడతారని వివరించారు. స్థల పరిశీలనలో ఏఈ పి.సురేష్, గ్రామసర్పంచి వి.బ్రహ్మనాయక్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్ చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ శ్రీనివాస్

శావల్యాపురం: జగనన్న లేఅవుట్స్‌కు సంబంధించి లబ్ధిదారులు సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో ఉండాలని వినుకొండ హౌసింగ్ డీఈ నినావత్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామసచివాలయ ఇంజినీర్లు హౌసింగ్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఈ మాట్లాడుతూ ఫేజ్-2లో భాగంగా శావల్యాపురం, ఈపూరు, బొల్లాపల్లి మండలాలు ఎంపిక చేశామన్నారు. అందులో భాగంగా శావల్యాపురం మండలంలో 1279 జగనన్న లేఅవుట్స్‌తో పాటు 177 మంది సొంత స్థలాలు కలిగిన లబ్ధిదారులను గుర్తించామని ఫాం 4(బి)లో సమగ్ర వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తదుపరి లబ్ధిదారులు నిర్మాణ పనులు చేపట్టాలే క్షేత్రస్థాయిలో సచివాలయ ఇంజినీర్లు, హౌసింగ్ అధికారులు బాధ్యత వహించాలన్నారు. నిర్మాణ పనులు ఆధారంగా జియోటాకింగ్ విధానంలో ప్రభుత్వం సత్వరమే బిల్లులు మంజూరు చేస్తుందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ పి.సీతారామయ్య, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో కూడిన వర్షం



ఎడ్వర్ట్‌పేట గ్రామంలో కూలిన వేప చెట్టు

రొంపిచర్ల: మండలంలో శనివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షానికి పలు గ్రామాలలో చోట్ల చెట్లు పడిపోయాయి. మండలంలోని ఎడ్వర్ట్‌పేటలో ఈదురుగాలులకు ఇళ్లపై ఉన్న రేకులు లేచిపోయాయి. చెట్లు పడిపోయాయి. విద్యుత్ స్తంభాలు వరిగాయి. రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంట నేల కొరిగింది. కళ్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న, మిర్చి, శనగలు తడవకుండా ఉండేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వాటిపై పరదాలు, టార్పాలిన్ పట్టలు కప్పారు. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు కురవడం వలన తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈదురు గాలులకు కరెంట్ సరఫరా నిలిచింది.

వడ్డీ రాయితీ ఉపయోగించుకున్న ప్రైవేటు కళాశాల



కమిషనర్ శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

నరసరావుపేట: ఎన్నో ఏళ్లుగా పురపాలక సంఘాలకు బకాయి పడిన ఆస్తి, కుళాయి పన్నులను ఏకమొత్తంగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ అవకాశాన్ని పట్టణానికి చెందిన ఓ కళాశాల నిర్వాహకులు ఉపయోగించుకున్నారు. పల్నాడు రోడ్డులోని ఎస్‌పీవీఎస్‌సీ అండ్ కేఆర్ కళాశాల యాజమాన్యం తమ కళాశాలకు సంబంధించి పురపాలక సంఘానికి గత కొన్నేళ్లుగా ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంది. ఇది 2023 ఆర్థిక సంవత్సరానికి రూ.86,24,069లకు చేరింది. ప్రభుత్వం వడ్డీ మాఫీని అనుసరించి వారు శనివారం పురపాలక సంఘానికి వడ్డీ రూ.38లక్షలు పోను మిగతా మొత్తాన్ని చెక్కు రూపంలో చెల్లించారు. ఈ మేరకు రూ.49,19,670 చెక్కును కళాశాల ప్రతినిధులు కమిషనర్ డి.శ్రీనివాసరావుకు అందజేశారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం వడ్డీ రాయితీ కల్పిస్తూ మంచి అవకాశం ఇచ్చిందన్నారు. దీనిని బకాయిదారులు అందరూ ఉపయోగించుకొని తాము చెల్లించాల్సిన అసలునే ఏకమొత్తంగా ఒకేసారి చెల్లించవచ్చన్నారు. మిగిలిన విద్యా సంస్థలు, వాణిజ్య సంస్థలు, పన్ను చెల్లింపు దారులు సదావకాశాన్ని ఉపయోగించుకొని వడ్డీ రాయితీ పొందాలని ఆయన కోరారు.